మూడు రోజులనుంచీ వర్షం ఏకధారగా కురుస్తోంది. ఈదురుగాలి ఉత్తరపు దిక్కునుండి వీస్తోంది, అంతకంతకూ పెద్దదౌతూ. గూళ్ళల్లో పక్షులు ఎక్కడివక్కడ సర్దుకున్నయ్. జడివాన రొదలో ప్రపంచం జడునిలా, స్తబ్ధంగా మత్తుగా ఉంది.

„అంత జడివానలోనూ అంతటి ఈదురు గాలిలోనూ జానకి రామయ్య కుటుంబసభ్యులు మాత్రం విశాలంగా ఉన్న వరండాలో కూర్చొని వీధివైపు చూస్తున్నారు, ఆశతో, దిగులుతో. విసుగుదల వాళ్ళ కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అవతల ఏముందో చూడనీయకుండా రోడ్డుమీద ఆకాశంనుండి భూమికి వ్రేలాడగట్టిన పల్చటి నీటితెర. బాహ్యానికి అంతరంగానికి జరుగుతున్న ఘర్షణను చాటుచేస్తూ వాళ్ళ కళ్ళల్లో పల్చటినీటితెర. చూసిచూసి ఇహ ఓర్చుకోలేక మెడమీదుగా పమిటచెంగును త్రిప్పుకొంటున్నది పార్వతమ్మ.

—0—

"ఇవ్వాళా రాలేదు."

"అవును" జానకిరామయ్య ముభావంగా అని ముఖం ప్రక్కకి త్రిప్పుకున్నాడు. ఆయన కళ్ళజోడు ముక్కుమీద జారిపోతోంది. కళ్ళ క్రింద ఏర్పడ్డ నల్లటిచారలు పొడుగు సాగుతున్నయ్.

"పన్నెండు దాటింది. నువ్వు లోపలికిపోయి భోంచెయ్. ఉట్టి మనిషివికూడాగాదు. మేము కాసేపుచూసి వస్తాలేం ఆశగదూమరి!"

విజయను చూస్తూ అన్నది పార్వతమ్మ. ఆమాట అంటున్నప్పుడు ఆమె కంఠం గద్గదికమయింది. ఈమధ్య ఆమె అనుకుంటున్నదానికన్నా ఎక్కువగా మాట్లాడేస్తోంది. విజయ అత్తగారి మాటలకు జవాబు చెప్ప లేదు.

"ఓయ్! నీ వొళ్ళు కూడా అంతమంచిదికాదు. ఈదురుగాలిలో ఎందుకు? లోపలికి వెళ్లు! నువ్వుభోంచెయ్" రోడ్డుమీదికి చూస్తూనే అన్నాడు జానకిరామయ్య. అలా అంటున్నప్పుడు ఆయన కంఠం ఆయనకే క్రొత్తగా వెలితిగా వినిపించింది.

"అవును. భోంచేస్తాను. ఎందుకుచేయనూ? అక్కడ వాడుతింటే యేం? తినకపోతే ఏం? నామాట ఏదివిన్నాడు గనుక ఇది వినలేదని నాకు బాధ?– లక్షణంగా భోంచేస్తాను. రావే విజయా" ఆవేశం వచ్చిన దానిలా అదాటున లేచినిలబడి మళ్ళా ఏదో జ్ఞాపకం వచ్చి ఉట్టి నేలమీద పడి భోరున ఏడవడం మొదలు పెట్టింది.

"ఒక్కడు వంశానికి రత్నమని ఒక్కడు! – దేశంలో ఎంత మంది లేరు? వీడికి ఎందుకు పుట్టాలి యీ బుద్ధి? ఏం బావుకుందామని? ఈ వయస్సులో మమ్మల్ని యిట్లా వదలిపెట్టి చివరకు కట్టుకున్న మొహమైనా చూచాడుగాదు దౌర్భాగ్యుడు.

"అత్తయ్యా!' విజయ బాధగా అంది. "మీరే ఆయన్నిట్లా అపార్థం చేసుకుంటే?"

ఇహ చెప్పలేకపోయింది. మాటమధ్యలో ఆపేసి ఆమె ఒళ్ళో తలదాచుకుంది.

"అపార్థంకాదే – కన్నకడుపుబాధ!!"

ఆమాటవిని కుర్చీలో కూచుని వానచినుకులు లెక్కపెడుతున్న వాడిలా జానకిరామయ్య ఇటువేపుకు తిరిగి –

"అదికాదే? నాకు లేదూ! బాధలు వస్తాయిమరి!! వచ్చినప్పుడే కాస్త ఓపిక పట్టాలి ఏంచేస్తాం? నిన్నూ నన్నూ కాదని పోయాడు. వాణ్ణి మనం కాదనుకోలేం కదా!"

ఉత్తరీయంతో కళ్లు తుడుచుకున్నాడు ఆయన.

"ఈ వంశాన్ని నిలబెట్టవలసినవాడు వాడు. అట్లా దేశాలుపట్టి పోయాడు. ఓయ్.... అదుగో పోస్టుమన్ వస్తున్నట్టున్నాడు."

ముగ్గురూ మంత్రముగ్ధుల్లాలేచి నిలబడి ముందుకు రెండడుగులు వేశారు. గొడుగు ఒకచేతపట్టి రెండోచేత్తో హాండిలు పట్టుకుని సైకిలు త్రొక్కుతూ వెనకసీటుమీద ఉత్తరాలకట్ట వాటర్‌ప్రూఫ్ సంచిలో పెట్టుకుని పోస్టుమన్ వస్తున్నాడు.

ఎంతమంచివాడు! అతను తమ యింటివేపే వస్తున్నాడు. ముగ్గురూ ఆశలకళ్ళతో అతనికోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అతను వచ్చాడు; ప్రక్కయింటివాళ్ళకి ఉత్తరం యిచ్చేసి వెళ్ళిపోతున్నాడు.

"ఏమయ్యా పోస్టుమాన్! మమ్మల్ని మర్చిపోయినావ్" జానకిరామయ్యకు పెద్దగా అరవాలనిపించింది. "మా అబ్బాయి వ్రాసిన ఉత్తరం ఇవ్వాళైనా యివ్వకుండా కదలడానికి వీల్లేదు." పార్వతమ్మ బిగ్గరగానే అంది.

"ప్చ్" అనుకున్నది విజయ. అది సంతోషమో విచారమో తెలియని ఒకానొక విచిత్ర పరిస్థితి.

పోస్టుమాన్ వెళ్ళిన తర్వాత వాళ్ళ మనసులు వానకురిసి వెలిసినట్లయ్యాయి. వెలితివెలితిగా ఉన్న ఆకాశంలో వాళ్ళ ఆశలు రూపాలను కోల్పోయాయి. ఇటు ఉన్న వస్తువుల్ని అటు గాలి విసిరివేస్తున్నట్లుగా వాళ్ళ జీవితాలను కనిపించని విధి ఉన్నట్లుండి పటపటికి

విసిరివేసినట్లయింది. "ఏం తప్పు చేశామనీ మాకీశిక్ష?" దేముడి మందిరంలో విగ్రహం ముందర సాగిలపడి వేడుకొంటున్నది పార్వతమ్మ.

"ఆయన చేసినపని సాహసమయిందికాదా?" జవాబుదొరకని ప్రశ్న విజయలో.

జానకిరామయ్యకు కొడుకు కళ్ళముందు మెదిలాడు.

"ఆరడుగులమనిషి. తనూ వాడూ కలిసి బజారులో నడిచిన ఆరోజున "మీఅంత అయ్యాడు మీవాడు. ఇక మీకేం బాధలేదు. కాలుమీద కాలువేసుకుని కొడుకులు రెండుచేతులా సంపాయిస్తూంటే మహరాజులా కాలం గడపవచ్చు" అన్నారు చూచినవాళ్లు. "హుఁ రెండు చేతులా సంపాయించటం" తనచేతులే వాడు విరక్కొట్టి వెళ్ళిపోయాడు-ఎక్కడికో నీఫాకి. ప్రేమతెలియని సైనికుల మధ్యకు! హృదయంలేని శతృవుల గుడారాలదగ్గరకు. యం. బి. బి. యస్. పాసయినాడు. అదీ యెలాగు? ఫస్టునప్యాసయినాడు. ఫస్టుఛాన్సున పాసయినాడు. ఎందుకూ? ఎవరికోసం - కన్నకడుపు రంపపుకోతపెట్టడానికి హ్హా! హో!!"

జానకిరామయ్య లేచి చుట్ట అవతల పారేసి వచ్చి కూచున్నాడు. ఎదురుగా ఉన్న అద్దంలో ఆయన రూపం వెక్కిరిస్తూ కన్పిస్తోంది. తలంతా ముగ్గుబుట్టలా నెరసిపోయింది. రెండుపళ్ళుకూడాపూడిపోయాయి. దవడలు లోపలికి పీక్కుపోయినయ్. ఈ వయస్సులో తను కొడుకు అండను కోల్పొయాడు. ఎంతటి దౌర్భాగ్యుడు తను! మార్కెటుకు తనువెళ్ళి బియ్యం తెచ్చుకోవాలి. నెయ్యికి, ఉప్పుకు పప్పుకూ చివరికి అగ్గిపుల్లకూ, చుట్టలకూ తన బట్టలకు తనే వెళ్ళాలి బజారుకు. వెళ్ళక బద్దకిస్తే ఇంట్లో జీవనమే ఆగిపోతుంది. వాడు ఫస్టున పాసయితే తన జీవితం కడతేరిందనుకున్నాడు. అందరిలాగే తనుకూడా ఆరోజున, పాసయినాడని తెలిసినరోజున "ఎక్కడవస్తుందిరా నీకు పోస్టింగ్?" అని అడిగాడు తను ముసి ముసి నవ్వును మీసాల వెనక దాచుకుంటూ.

వాడు తనవేపుచూచాడు. ఆచూపు కొత్తగా ఉంది. అయినా అలా చూస్తా డేఁవిటి? తన అంతరాంతరాళాలను శోధిస్తున్నట్లుగా! "నాన్నగారూ?" అన్నాడు వాడు. ఆ శబ్దాన్ని అట్లా వినలేదు తను. అందులో ఆత్మీయతకు బదులు ఆత్మవిశ్వాసం, కర్తవ్య దీక్ష విన్పించేయ్.

"నీఫాలో చేస్తాను".

"ఒక్కసారి తనమీదపడింది. మేఘాలు లేకుండా చంద్రుడు ప్రశాంతంగా వెలుగుతున్నపుడుపడ్డ పిడుగుపాటు."

"అదేవిఁటి బాబూ!".

"ఉద్యోగం వచ్చింది. ఇంటర్వ్యూ అయి సెలక్షనయి అంగీకారము ఇచ్చివచ్చాను, అమ్మనూ మిమ్మల్ని చూసిపోదామని"

తను మాట్లాడలేకపోయాడు. విపరీతమైన కోపం వచ్చింది.

తనంతవాణ్ణి కాదు. తనకన్న ఎక్కువచదివినవాణ్ణి, ఎక్కువ ఉద్యోగంలోకి వెళ్ళినవాణ్ణి - అఫ్టర్ ఆల్. తను యు.డి.సి.గా రిటైర య్యాడు - డాక్టరయినవాణ్ణి, హుఁ! తనేమనగలడు? "ఇది ధర్మంగా వుందట్రా" అని మాత్రం ఒక్కమాట అన్నాడు. అవును ఒక్కటంటే ఒక్కమాటే।" . వాడునవ్వాడు. ఏమినవ్వు. తనవాదననంతా పరాస్తం చేస్తున్నట్లుగా. "నేను గవర్నమెంటు స్కాలర్‌షిప్‌మీద డాక్టర్ చదివాను" అన్నాడు గంభీరంగా. ఇహ వాడితో మాట్లాడడం తనకు అనవసరం అనిపించింది. "వెళ్ళు వెళ్ళు మీ అమ్మతో చెప్పు" అని తను వీధిలోకి పనివున్నట్లుగా వెళ్ళిపోయాడు. తను కొంపనుండి వెళ్ళ నట్లే వెళ్ళి మళ్ళీ లోపలికివచ్చాడు. చప్పుడుగాకుండా వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చాడు. లోపలికివస్తే తనకేంకనిపించింది? యాభైఏళ్ళ పార్వతమ్మ, ఇరవైఏళ్ళ పసివాణ్ణి కావలించుకుని ఏడుస్తోంది. అప్పటికే చాలా గ్రంథం జరిగిపోయిందన్నమాట. ఆమె ఎక్కిళ్ళ మధ్యగా మాటల మింగుతూ అన్నది.

"పదిమందినీ కంటే పిల్లలు పోయి పోయి నువ్వొక్కడివీ మిగిలావురా."

"నేనెక్కడకు పోతానమ్మా। మళ్ళీ యింతలో వచ్చేస్తాను".

వాడు తల్లికళ్ళు తుడుస్తున్నాడు. ఆ తల్లి కళ్ళుఎర్రని ప్రేమతో ఆరని మంటల్లా ఉన్నాయి. వాడిచేతులు పూలరేకుల్లా దేవతల హస్తాల్లా మెత్తగా వున్నయ్.

వాడు మెల్లగా తల్లి తలను తన వాడినుంచి తప్పించి లేచి నిల బడ్డాడు. పొయ్యిలో జ్వాల రేగుతోంది. ఎర్రనిజ్వాల.

దక్షిణంవేపు కిటికిగుండా ఉదయపవనం వీస్తోంది. చల్లనిగాలి. ఏదో ఊహ వచ్చినట్లు పార్వతమ్మ—

"విజయతో చెప్పిరారా"

"అలాగేనమ్మా"

వంటింట్లో అన్నీ అమర్చి హాల్లోకి వచ్చిన విజయకు మామగార్ని చూసి ఆనాడు భర్త తనతో చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి.

"విజయా"

తన తల్లో విరపూసిన జాజులను చూసి అన్నారాయన.

"నేను వెళ్తున్నాను"

ఆయన నోటిని తను చేత్తోనే మూసివేసింది. ఆతర్వాత అంతు లేని సిగ్గు తననావరించింది. సిగ్గుమబ్బు పోయింతర్వాతఅన్నది.

"వెళ్ళొస్తాను" అనండి.

"ఓసి పిచ్చిదానా" తన కనురెప్పల చుంబించారాయన, "ఇంతటి బేలవా నువ్వు!"

అవునన్నట్లుగా తలవూపింది. చెంపమీద ఒచ చిన్నదెబ్బ. "బేలతనం పనికిరాదు. నెరజాణ తనం కావాలి."

"ఎందుకూ?" తనకళ్ళు చేపల్లా మిలమిల లాడాయి.

"నా కోర్కె నెరవేర్చడానికి"

"ఏమిటో చెప్పండి"

"నేనొచ్చేవరకు నువ్వు మనింట్లోనే ఉండాలి, అమ్మా నాన్న ముసలివాళ్ళయిపోయారు. ఉత్త పిరికి గుండెలు వాళ్ళవి. ప్రేమ తప్ప మరొక భావమే లేదు ఆ గుండెల్లో. నా మీద ప్రేమ నీ మీదకు మరలించుకోవాలి. నన్ను గూర్చిన ఆలోచనలను మనకు పుట్టబోయే పసి పాపమీదకు మరలించాలి. ఏం?"

"ఏముందీ?" తనకు ఆ ప్రశ్నతో సమాధానం దొరికినట్లే బ్రహ్మనంద పడిపోయారాయన. ఆ రోజునుండి అత్తమామలిద్దరూ తనకు తల్లి, తండ్రిగా మారిపోయారు.

"మామగారూ, మీరు భోం చెయ్యండి. మీరు ఎంగిలి పడితే గాని అత్తగారు భోం చెయ్యరు."

ఆమె మాట ఇంకా పూర్తిగాలేదు. "మేమిద్దరం ఎంగిలిపడితే గాని నువు భోంచెయ్యవ్. ఎల్లాగమ్మా యిట్లా అయితేనూ," అంటూ విసుగ్గా, చేసేదిలేక పట్టుబట్ట కట్టుకున్నారాయన. ఆయనతో పాటు మిగిలిన యిద్దరాడవాళ్ళూ ఎంగిలి పడ్డారు.

"వర్షం యింకా పొడిపొడిగా పడుతూనే ఉంది. రోడ్డు ప్రక్క కాలవల్లో కాగితపు పడవలు తేలిపోతున్నాయ్. ఇండ్లల్లో నిలవలేని వాళ్ళు వీధుల్లోకి వచ్చి శరీరాలు తడుపుకుంటున్నారు. వరండాలో కూర్చుని జానకిరామయ్య వీధివైపే చూస్తున్నాడు. ఎదురుగా వున్న ఇంట్లోకి అద్దెకు వచ్చిన ఆలుమగలు సంవత్సరంన్నర పసిబిడ్డడ్ని మధ్య పెట్టుకుని నవ్వులాడుకుంటున్నారు.

జానకిరామయ్య హృదయం మూగగా బాధపడింది. "తన బిడ్డా విజయాకూడా ఇట్లా నవ్వుకోవలసిన వాళ్ళేగదా!!" పుట్టు గుడ్డివాడినొకణ్ణి

ముప్పైఏళ్ళ యువకుడు వీధిలో నడిపించుకుపోతున్నాడు మెరకా పల్లం చెబుతూ. తన జీవితంలోని మెరకాపల్లం కూడా తెలియ చెబుతూ తన కొడుకు కూడా తన నిట్లాగే నడిపించాలి. ప్రతి నెలా ఐదో తారీఖున రెండువందలకు పైగా మనియార్డరు వస్తుంది వాడి దగ్గరనుంచి. దానితో వాడి బాధ్యత తీరినట్లేనా? నాలుగు నెలలక్రితం తన తల్లికో వుత్తరం వ్రాసుకున్నాడు వాడు. నెలరోజుల క్రితం విజయకో ఉత్తరం వ్రాసాడు. ఇహ తనకు రావాలి. ఏమిటో తన జీవితం ఇట్లానిరీక్షణ లోనే రాలి పోయేట్టుంది!

"ఏమిటన్నయ్యా, అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? విశ్వనాథం ప్రశ్నతో జానకిరామయ్య ప్రపంచంలోకి వచ్చాడు. తన ఆలోచనలలో మునిగి ఆయన రాకను తను గమనించనందుకు తను నొచ్చుకుంటూనే అడిగాడు. "మీ అబ్బాయి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందా?"

"ఆ, వచ్చింది." విశ్వనాథం సంతోషంగా జవాబు చెప్పాడు.

"పోనీలే నీకైనా వచ్చింది" అన్నాడు జానకిరామయ్య నిట్టూ రుస్తూ.

విశ్వనాథం, జానకిరామయ్య చాలా తమాషాగా స్నేహితు లయ్యారు. స్నేహితులై గూడా అప్పుడే ఇరవై ఏళ్ళకు పైబడింది. దేశమంతా అట్టుడికిపోతున్న "క్విట్ ఇండియా ఉద్యమం" రోజులు. రైలుపట్టాలు పీకాలనీ, ప్రభుత్వాన్ని స్తంభింప చేయాలనీ యువతరం ఆవేశపడుతోంది. ఆఫీసులముందు పికెటింగ్ జయప్రదంగా సాగు తోంది. ఆరోజున కలెక్టరేట్ముందు పికెటింగ్. విశ్వనాథం ఓగ్రూపుకి నాయకత్వం వహించి బయటినుంచి లోపలికి, లోపలినుంచి బయటికి ఎవ్వరినీ పోనీకుండా కాపలా కాస్తున్నాడు. పది దాటింది. జానకిరామయ్యా ఫైళ్ళతో అక్కడకు వచ్చాడు. జనమంతా గేటుదగ్గర నిలబడ్డారు. "మీరు వెళ్ళడానికి వీల్లేదు" అన్నాడు, నింపాదిగానే అయినా దృఢంగా. "నేను

వెళ్ళి తీరాలి'' అన్నాడు జానకిరామయ్య అంత దృఢంగానూ. వీళ్ళిట్లా మాట్లాడుకుంటుండగానే ఒక సత్యాగ్రహి గేటుకు అడ్డంగా నేలమీద పడుకున్నాడు. వెళ్ళదల్చుకుంటే తన మీదుగా దాటి వెళ్ళమని. లోపల్నుంచి తెల్లదొర ఇదంతా చోద్యంగా చూస్తున్నాడు. ''చూశారుగా వెళ్ళదలచుకుంటే మీ సోదరుల శరీరాలమీదుగా నడచి వెళ్ళండి'' అన్నాడు విశ్వనాథం.

''నేను వాళ్ళ ఉప్పుతిని యీ బ్రతుకు గడుపుతున్నాను. ఇది న్యాయమో, అన్యాయమో నాకు తెలియదు. కొలువుచేసినచోట చిత్తశుద్ధిగా కొలువు కొలవాలన్నదే నాకు తెలిసింది. ఇది తప్పయితే మిమ్మల్ని క్షమించమని వేడుకుంటున్నాను''. అంటూ జానకిరామయ్య నేలమీద పడుకున్న ఇద్దరినీ దాటి లోపలికి వెళ్ళిపోయాడు.

ఆమర్నాడు ఇద్దరూ రోడ్డుమీద తారసిల్లారు.

''మిమ్మల్ని మెచ్చుకుంటున్నాను'' అన్నాడు విశ్వనాథం.

''ఆలోచించగా నేను చేసింది తప్పని నాకే తెలిసింది. అయినా ఉద్యోగంలేక బ్రతకడం చేతగాక''.........మాటను మధ్యలో మింగేశాడు సిగ్గుతో జానకిరామయ్య. ఆ తరువాత అనేకసార్లు వాళ్ళిద్దరూ కలుసుకున్నారు. స్నేహం సాయంకాలపు నీడలా వాళ్ళిద్దరిమధ్యా పెరిగింది. విశ్వనాథం ఇద్దరు వ్యాపారం పెట్టి బ్రతుకు సాగించాడు. ఉన్న ఒక్క కొడుకునూ బి.ఎ. ప్యాసుచేయించాడు. అతన్నావూళ్ళోనే ఏదో ఉద్యోగం చూసుకోమన్నాడు. ఆసమయంలోనే జానకిరామయ్యకూడ యు.డి.సి.గా రిటైరయ్యాడు. తన కొడుకుగూడా హౌస్ సర్జన్‌గా తన వూరికే వస్తే బావుండుననుకున్నాడు. తాము ఆశలు పెంచుకున్న తమ బిడ్డలకు ఉద్యోగాలు రాకముందే దేశానికి చైనాయుద్ధం వచ్చింది. ఆ తర్వాత పాకిస్థాన్‌యుద్ధం. మిడతలదండులా చీనావాళ్ళు పాకిస్థాన్‌తోకలసి భారత భూభాగాన్ని ఆక్రమించారు. అహంకారంతో విజృంభించారు. దేశంలో

ఆగ్రహం, కొందరు తల్లుల గుండెల్లో హాహాకారం. సైనికులు కావాలి. ఫ్యాక్టరీలు పనిచెయ్యాలి, నగలు కావాలి.

ప్రతి మనిషి ఒక ఫైర్ బ్రిగేడ్. ప్రతి బ్రెయిన్ ఒక బ్రెన్‌గన్. ఎవరికి తోచిన త్యాగం వాళ్ళు చేస్తున్నారు. ధనం, బలం, మనం, జనం అన్నీ అర్పింపబడుతూనే ఉన్నాయి. విశ్వనాథం, జానకిరామయ్య "ఏమిచేద్దాం?" అనుకున్నారు. అనుకుంటూండగానే "మీరేమివ్వగలరు- ఏమిస్తే యీ సమయానికి తగిన త్యాగం అవుతుంది? అందుకే మేం వెళ్ళుతున్నాం సైన్యంలోకి" అన్నారు వాళ్ళ బిడ్డలు. అని వెనుకకు చూడకుండా ముందుకు వెళ్ళిపోయారు. విశ్వనాథానికి మొదట్లో కొంత బాధకలిగింది. తాను ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ ఇంట్లో గడపడం కష్టమనిపించింది. కాని రోజులు గడవగా తన కొడుకు చేసినపని సబబే ననిపించింది.

"తనరోజుల్లో తాను అన్నీ వదిలిపెట్టి గాంధీజీ ఏమిచెయ్యమంటే అది చేయలేదూ? ఇదీ అంతే. నెహ్రూజీ ఆజ్ఞ ఇచ్చారు. శాస్త్రీజీ ధైర్యమిచ్చారు. ఆ నాయకుల వాక్కుల్లో, భారతాత్మ పిలుపు వినిపించింది. వాడు వెళ్లాడు ఉడుతాభక్తి దేశానికి సేవ చేద్దామని. ఇంటిపట్టున కూర్చుని దుఃఖించడంకన్నా, అక్కడ యుద్ధరంగంలో సైనికుడుగా ద్రోహులతో, నయవంచకులతో పోరాడుతున్న తనకొడుక్కు, విజయం కలగాలనీ విజయుడై తిరిగిరావాలనీ, కోరడం, అందుకు భగవంతుణి ప్రార్థించడం మంచిదికాదూ?"- ఈ ఊహ వచ్చి మనస్సు స్థిమితపడిం తర్వాత విశ్వనాథం తరుచూ జానకిరామయ్య ఇంటికి వచ్చేవాడు.

ఇద్దరూ తమ బిడ్డలనుగురించే మాట్లాడుకొనేవారు. ఒకరి నొకరు ఓదార్చుకునేవారు. ధైర్యం చెప్పుకునేవారు. భవిష్యత్ స్వప్నాలకు పునాదులు వేసేవారు. అతను వచ్చినపుడు ఎప్పుడూ జానకిరామయ్య బేలగా తేలిపోలేదు. పేకాటతోనో, చదరంగంతోనో కాసేపు కాలక్షేపం చేసే

వాడు. ఒకరి ఉత్తరాలు మరొకరికి చూపించుకుంటూ మురిసిపోయ్యేవారు. కానీ నెలరోజులనుంచీ ఉత్తరం లేకపోవడంతో ధైర్యం సన్నగిల్లి డీలా పడిపోయాడు జానకిరామయ్య. పైగా ఇంట్లో పార్వతమ్మ మాతృ హృదయం తల్లడిల్లుతోందని వేరే చెప్పకుండానే తెలుస్తున్నది. విజయ కూడా పైకి చెప్పలేకపోయినా లోలోపల అధైర్యపడి పోతున్నదని మొహం చూస్తేనే తెలుస్తున్నది. ఈ సమయంలో విశ్వనాధం వచ్చాడు.

"అన్నయ్యా! నీకోమంచి వార్త చెప్పనా?"

జానకిరామయ్య గాజుకళ్ళతో చూశాడు విశ్వనాధంవైపు.

"అబ్బాయి వచ్చేసినట్లే!"

"ఏ అబ్బాయి?"

"అదేమిటన్నయ్యా! మనవాడే గోపాలం. అక్కణ్ణుంచీ వచ్చేస్తున్నాట్ట. రేపొద్దున మెయిల్లో దిగుతున్నాడు" ఆ వృద్ధుని హృదయంలో ఆనందం చిందులేస్తోంది. "వారం రోజులక్రితం ఇలా అని ఉత్తరం వ్రాస్తే ఇవ్వాళ అందింది."

జానకిరామయ్య తనూ తగినంతగా తన సంతోషాన్ని తెల్పలేక పోతున్నానే అని సిగ్గుపడుతూ "ఇంకానయం మీవాడొచ్చిం తర్వాత అందింది కాదు. అయినా ఉత్తరాల ప్రసక్తి ఎందుకు ఇంక ?–మనిషే తిరిగొస్తుంటే."

విశ్వనాధం మధ్యలో తిరిగి అందుకున్నాడు. "నాకు ఎంత సంతోషంగా వుందంటే–"

"వుండదూ మరి" జానకిరామయ్య జవాబిచ్చాడు "నీసంతోషంలో అబ్బాయిని ఇక్కడకు తీసుకురావడం మర్చిపోవుగదా!"

"ఎంతమాట, ఎంతమాట।"

ఆరాత్రి విశ్వనాథానికినిద్రలేదు. జానకిరామయ్యకు తనకు కొడుకు తిరిగొస్తున్నట్లు కల వచ్చింది. విశ్వనాథం వాళ్ళబ్బాయి రానున్నాడని పార్వతమ్మతో చెప్పేసరికి "మన అబ్బాయి క్షేమంగా వెళ్లాడు. లాభంగా వస్తాడు. నే చేసిన పూజలన్నీ ఏమవుతాయి?" అన్నది ఆ ముసలామె. తన కడుపులో పెరుగుతున్న పసిజీవితో మాటాడింది విజయ ఆరాత్రి.

"మీనాన్న త్వరలోనే వస్తార్రా నువ్వు పుట్టకముందే, నీ కోసం ఎన్నెన్ని తెస్తారో. ఏమేమి తెస్తారో పుట్టింతర్వాత చూసి నీ వెంత ఆశ్చర్యపడిపోతావో!"

రాత్రంతా వానపడ్తోంది. మర్నాటి ప్రొద్దుటికి నాలుగురోజులకు మొదటిసారిగా చిరుఎండ కాసింది. పక్షులు స్వేచ్ఛ విలువతెలిసి ఆకాశంలో పల్టీలుకొడుతున్నాయి. జానకిరామయ్య మళ్ళీ వరండాలో కూర్చున్నాడు. ఆడవాళ్ళిద్దరూ గడప అవతలున్నారు. ఆరోజు రేడియోలో విన్న సంగతి వాళ్ళకి కొండంత ధైర్యాన్నిస్తున్నది. యుద్ధ విరమణ జరిగింది. ఎందరు తల్లులగుండెల్లో తృప్తినిండిన మాట!! వాళ్ళుముగ్గురూ కలతతగ్గి ఎదురు చూస్తున్నారు. యుద్ధరంగం నుంచి తిరిగివచ్చే అతని కోసం. దూరంగా విశ్వనాథం రూపం కన్పిస్తోంది. అతని ప్రక్కన అతనిమీద చెయ్యివేసి ఒకకాలు కట్టికావడంతో, కుంటుతూ వస్తున్న ఆ కుఱ్ఱవాడెవడు?"

దగ్గరకు వచ్చి, మెట్లెక్కి వాళ్ళిద్దరూ వరండాలోకి వచ్చిందాకా వాళ్ళనట్లా చూస్తుండిపోయారు. "ఇడుగోనయ్యా మా అబ్బాయి" అన్నాడు విశ్వనాథం కంఠంలో బరువుతో. ఆ కుర్రవాడు గలగల నవ్వేశాడు. "బతికి బయటపడ్డందుకు సంతోషించక మా నాన్న విచారిస్తాదేమిటండీ" అన్నాడు ఏదో కంప్లెయింటు చేస్తున్నట్లు.

"నువ్వు ! నువ్వు! గోపాలువా ?" అన్నాడు జానకిరామయ్య అతికష్టంమీద స్థిమితానికి వస్తూ.

'అవునండీ ఏం అంతగా మారిపోయానా ? ఈ కర్రకాలుచూసి గాభరా పడ్తున్నారు కదూ - ఇంకా నయం సమయానికి ఆ డాక్టరువచ్చి తగినచర్య తీసుకోబట్టిగాని లేకపోతే మా పని ఏమయి వుండేదో' ఆడవాళ్ళిద్దరూ చెవులొరబెట్టుకు వింటున్నారు.

'ఇట్లా నేను బ్రతికి మీముందు వుండడానికి కారణం ఎవరో తెలుసా ?' వాళ్లు అడ్డంగా తలలూపారు.

'మీ అబ్బాయి'

"మా అబ్బాయా ?" పార్వతమ్మ పెద్దగా అరిచింది. "ఎట్లా వున్నాడు ? కులాసాగా వున్నాడా ? చిక్కిపోయాడా ? నల్లబడ్డాడా ? ఎప్పుడొస్తానన్నాడు ?"

ప్రశ్నలకు ఆ కుర్రవాడే సమాధానమూ చెప్పలేదు. "ఉండవే! అతగాణ్ణి సంగతేదో చెప్పనీ ! జానకిరామయ్య విసుక్కున్నాడు.

"మా క్యాంపుమీదికి పాకిస్థాన్ వాళ్లు వచ్చారు. మెషీన్‌గన్స్‌తోటి మేం ఇరవైమందిమి వున్నాం. 'ఫైర్' అన్నమాటతో పాకిస్తాన్ వాళ్ళనెదుర్కొన్నాం. ఓ గంటకు పైగానే. మాలో నలుగురు చని పోయారు. ముగ్గురి పరిస్థితి అతి ప్రమాదంగా వున్నది. నాకు కాళ్ళ మీద గాయాలు. మరొకడికి భుజంమీద. కొంతసేపయిన తర్వాత వాళ్ళ గుళ్ళవర్షంనుంచి కేవలం ధైర్యంతోనే మేం బయటపడ్డాం. బేస్ క్యాంప్‌కు ఎన్నిమైళ్లు నడిచామని? తెలియని ప్రదేశంలో, బుజాలమీద గాయపడ్డ మనుషుల శరీరాల బరువుతో, నడచి నడచి పడిపోయాను. కళ్లు తెరిచేసరికి 'బేస్ క్యాంప్‌లో అండర్ గ్రౌండ్ హాస్పిటల్‌లో వున్నాం. నాలాగా ఓవందమంది వున్నారు. ఒకే ఒక డాక్టరు మన

తెలుగువాడే కన్పించాడు. తెలివొచ్చింతర్వాత "హలో డాక్టర్! ఇక్కడి కెలా వచ్చాను? అని అడిగాను. ఆ డాక్టరొక్కడూ హెలికాప్టర్‌తో ఫార్వర్డ్ ఏరియాస్‌కి వెళ్ళి గాయపడ్డ సైనికులకు ట్రీట్‌మెంట్ ఇస్తున్నాడట. అక్కడికక్కడే ట్రీట్‌మెంట్ ఇవ్వలేనివాళ్ళను క్యాంపుకు తీసుకు రావడం. నన్నూ అట్లాగే తీసుకువచ్చారు. "డాక్టర్! యూ మై సేఫ్" అని అడిగాను. తలూపాడు. "ఒక కాలు తీసేసి నా ప్రాణం నిలపెట్టాడు. లేకపోతే ఏమైపొయ్యేవాణ్ణో!"

"మా అబ్బాయి నీ ప్రాణం కాపాడాడా నాయనా?"

నా ప్రాణం ఒక్కటే కాదమ్మా! నాలాంటివాళ్ళను ఎన్నివందల మందినో కాపాడుతున్నాడు. దేశం కోసం ప్రాణాలు అర్పించవచ్చిన ప్రతి సైనికుడి ప్రాణాన్నీ అవసరమయిన సమయంలో ఆదుకుంటున్నాడు. ఇది మామూలు సేవకాదమ్మా; ప్రాణాలుపోయేచోట ప్రాణాలు నిలబెట్టడం. మరణదేవత వికటాట్టహాసం చేసేచోట మనిషిని చిరంజీవిని చెయ్యడం!!"

"ఎప్పుడొస్తానన్నాడు?" పార్వతమ్మ మళ్ళీ బేలగా అడిగింది.

"మనుషుల్ని బ్రతికిస్తున్నవాణ్ణి గురించి మనం భయపడడం యేమిటి! వాణ్ణి సేవచేయనీ! ఎందరు తల్లిదండ్రులు నాతండ్రికి ఋణపడివుంటారో! చెయ్యనీయ్! వాణ్ణి సేవచెయ్యనీ! వాడిసేవ వాణ్ణిచేయనీ! జానకిరామయ్య కంఠం మారింది సేవచేస్తూకూడా మన అబ్బాయిమనను తల్చుకుంటున్నాడే. మనకింకా భయమెందుకూ?" విజయ మనస్సు సంతృప్తితో ఊగిసలాడిపోతున్నది. అయినా తనకర్తవ్యం. "మామగారూ భోజనానికి వేళయింది" అని జ్ఞాపకం చేసింది.

"ఇవ్వాళ విశ్వనాథమూ వాళ్ళబ్బాయికూడా ఇక్కడే భోజనం చేస్తారు. వెళ్ళి ఏర్పాటు చేయమ్మా" విజయ సంతోషంతో తేలిపోతూ లోపలికెళ్ళింది.

తను విజయ, ఆయన విజయశ్రీ, పుట్టబోయే పసికందు భారత స్వాతంత్ర్యజ్యోతి. ఇంక తమకు ఓటమి యేమిటి ?

బయట ఆకాశం వెలుగుతో నిండిపోతోంది. మనుషుల మొహం మీద పిరికితనం తొలగి నవ్వు మొలకెత్తుతోంది.